
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 28 । జూన్ । 2025



సోమశిలలో 33.300 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 33.300 టీఎంసీలు ఉన్నాయి.పెన్నార్ డెల్టాకు 3.330, ఉత్తర, దక్షిణ కాలువలకు 1275 క్యూసెక్కుల చొప్పున వదులుతున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.98,720
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,957
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,226
నవర (8 గ్రాములు)	రూ.73,808

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.5 /28.9

జిల్లాలో శనివారం వాతావరణం పొడిగా ఉంటుంది. అక్కడక్కడ ఆకాశం మేఘావృతమై ఉండనుంది. శుక్రవారం గాలిలో తేమ 46 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఆవుల తరలింపును అడ్డుకున్న గోరక్షకులు

- జరిమానా విధించి వదిలేసిన ఎస్సై
- ఎస్పీకి ఫిర్యాదు



ఇరుకు వాహనంలో కట్టేసిన గోవులు

ఉలవపాడు: అక్రమంగా గోవులను లారీలో తరలిస్తుండగా గోరక్షకులు, బీజేపీ నేతలు అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం చీమకుర్తి నుంచి తిరుపతికి కారులో వెళ్తున్న బీజేపీ నేతలు గుండా శ్రీనివాసరావు, శివారెడ్డి, నరేష్ కుమార్, సుబ్బారావులకు మన్నేటికోట అడ్డరోడ్డు సమీపంలో గోవులను అక్రమంగా తరలిస్తున్న వాహనం కంటపడింది. దీంతో అడ్డుకుని పరిశీలించారు. గోవులతో సహా వాహనాన్ని, తరలిస్తున్న వారిని ఉలవపాడు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే గోవులను సరంక్షించడంతోపాటు అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాల్సిన ఎస్సై అంకమ్మ ఆ వాహనానికి రూ.2,200 జరిమానా వేసి ఆవులను తరలించే వాహనాన్ని వదిలేశారు. దీంతో వారు జరిమానా కట్టి వెంటనే గోవులను తీసుకుని వెళ్లిపోయారు. ఎస్సై వ్యవహరించిన తీరుపై సదరు బీజేపీ నేతలు ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. గోవులను గోశాలకు తరలించకుండా, ఇరుకుగా ఉన్న వాహనంలో తిరిగి పంపించడంతో పోలీసులపై కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మంత్రి నారాయణ జమానాలో..

కీచక అధికారి



- కూటమి పాలనలో చెలరేగుతున్న నీచులు
- ఇప్పటి వరకు టీడీపీ నేతలే.. తాజాగా ఉన్నత స్థాయి అధికారులూ..
- సచివాలయ మహిళా పోలీస్‌కు లైంగిక వేధింపులు, అసభ్యకర మెసేజ్‌లు
- ఐఏఎస్ హోదా సీటులో నగరపాలక సంస్థ ఉన్నతాధికారిగా విధులు
- బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణకు ఆదేశించిన కలెక్టర్
- కామాంధుడికి నిస్సిగ్గుగా ఉన్నతాధికారులు, మంత్రి అభయం
- బాధితురాలిని బెదిరించి దూరంగా పంపిన అధికారులు

కూటమి పాలనలో సామాన్యులైన బాలికలు, మహిళలకే కాదు ప్రభుత్వ ఉద్యోగినుల మాన, ప్రాణాలకూ ముప్పు తప్పడం లేదు. కూటమి పార్టీల్లోని కీలక నేతల నుంచి కార్యకర్తల వరకు సభ్యసమాజం తలదించుకొనేలా పసి పిల్లలతో పాటు వివాహితుల మానాలను దోచుకుని చివరకు యమకింకరులు అవుతున్నారు. ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడంతో తాజాగా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ జమానాలో ఓ మహిళా పోలీస్‌కే లైంగిక వేధింపులు తప్పలేదు. మున్సిపల్ శాఖలో ఉన్నతాధికారే కామాంధుడి అవతారమెత్తిన ఘటన స్థానికంగా సంచలనం రేపుతోంది.

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఆడ బిడ్డలకు భద్రత లేకుండా పోయింది. రోజూ ఎక్కడో ఓ చోట అభంశుభం తెలియని పసిబిడ్డల నుంచి మహిళలపై అత్యాచారాలు, 'హత్యా'చారాలకు హద్దులేకుండా పోయింది. రాష్ట్ర పాలకులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తుంటే.. కూటమి పార్టీ నేతలు కీచకులుగా చెలరేగిపోతున్నారు. అడ్డుకోవాల్సిన పాలకులు, పోలీస్ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. దీంతో ఉన్నతస్థాయిలోని ఓ అధికారి తన పరిధిలో పనిచేసే వార్డు సచివాలయ మహిళా పోలీస్‌పైనే కన్నేసి లైంగిక వేధింపులకు పాల్పడడంతోపాటు అసభ్యకర మెసేజ్‌లు పెట్టి మానసికంగా కుంగిపోయేలా చేసిన ఘటనకు సభ్య సమాజం సిగ్గుపడుతోంది. ఇటువంటి కీచక అధికారిపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా, బాధిత మహిళా కానిస్టేబుల్‌పైనే చర్యలు తీసుకోవడం కూటమి పాలకుల నీచపు తీరుకు అద్దం పడుతోంది. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో మూడో డివిజన్ వార్డు సచివాలయంలో మహిళా పోలీస్‌గా ఓ వివాహిత పనిచేస్తోంది. ఆమెపై కొంత కాలంగా కార్పొరేషన్ ఉన్నతాధికారి కన్నేశాడు. నిత్యం ఏదో విషయంపై ఆమెతో ఫోన్‌లో సంభాషణ చేయడం, రాత్రి వేళల్లో అసభ్యకర మెసేజ్ పంపడం చేస్తున్నాడు. ఉన్నతాధికారి కావడంతో కొన్ని రోజులపాటు ఆమె అతని వేధింపులను భరిస్తూ వచ్చింది. ఇదే అలుసుగా తీసుకున్న సదరు అధికారి శ్రుతి మించి అసభ్యకర మెసేజ్‌లు పంపారు. తనతో గడిపితే నీకు అన్ని సుఖాలు అందిస్తానంటూ వేధించడం మొదలు పెట్టారు. ఆమె ప్రతిఘటించడంతో పలు నిందారోపణలు చేస్తూ విధుల్లో ఇబ్బందులకు గురి చేయడం ప్రారంభించాడు. ఉన్నతాధికారి ఆగడాలు మితిమీరడంతో బాధిత మహిళ ఈ నెల 16న కలెక్టర్ ఆనంద్‌ను కలిసి ఆధారాలతో సహా ఫిర్యాదు చేసింది.

విచారణకు ఆదేశాలు

కార్పొరేషన్ ఉన్నతాధికారిపై బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ జెడ్పీ సీఈఓ మోహన్‌రావును విచారణకు ఆదేశించారు. దీంతో సదరు కామాంధ అధికారిని విచారణకు పిలిపిస్తే హాజరుకాలేదు. బాధిత మహిళ మాత్రం విచారణకు హాజరై కీచక అధికారి ఫోన్ ద్వారా పంపిన అసభ్యకర సందేశాలు, వాయిస్ మెసేజ్‌లకు సంబంధించి పలు ఆధారాలు సమర్పించినట్లు సమాచారం. ఈ మేరకు విచారణాధికారి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది.

సదరు అధికారికి మంత్రి అభయం?

మహిళా ఉద్యోగిని లైంగికంగా వేధిస్తున్న కార్పొరేషన్ ఉన్నతాధికారి ఆశాఖ మంత్రి కార్యాలయం అండ చూసుకుని కలెక్టర్ నియమించిన విచారణాధికారి ముందుకు హాజరుకాకపోవడం చర్చనీయాంశం అయింది. మంత్రి అభయంతోనే దుస్సాహసానికి ఒడిగట్టాడని అర్థమవుతోంది. మహిళలకు భద్రత కల్పిస్తామని గొప్పలు చెప్పుకునే మంత్రి నారాయణ ఇలాకాలోనే మహిళా పోలీస్‌కు లైంగిక వేధింపులు జరిగితే కనీస చర్యలు తీసుకోకపోగా, సదరు కీచకుడికి మద్దతుగా నిలవడంపై మహిళాసంఘాలు మండిపడుతున్నాయి. విచారణను నీరుగార్చేలా అధికారులు సాయపడుతున్నారన్న ఆరోపణలున్నాయి. వాస్తవంగా నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్‌గా ఐఏఎస్ స్థాయి అధికారి ఉండాలి. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతోనే ఐఏఎస్ అధికారి సూర్యతేజను కమిషనర్‌గా నియమించారు. నగరపాలక సంస్థలో షాడో మంత్రులు, ఎమ్మెల్యేలు, తమ్ముళ్లు చేసే అవినీతి పనులకు అడపాదడపా చెక్ పెట్టేవారు. ఐఏఎస్ హోదాలో తప్పులు చేస్తే భవిష్యత్‌లో ముప్పు తప్పదని భావించి తమ్ముళ్ల అవినీతికి అడ్డుపడుతున్నారు. దీంతో షాడోలు మంత్రి నారాయణకు సదరు ఐఏఎస్ అధికారిపై ఫిర్యాదులు చేసి ఆ స్థానంలో తాము చెప్పినట్లు పనిచేసే సాధారణ అధికారిని అందలం ఎక్కించి ఆ సీటులో కూర్చోబెట్టారు. అప్పటి నుంచి కార్పొరేషన్‌లో తమ్ముళ్ల ఆగడాలకు అంతేలేదు. అధికారి సైతం కామాంధుడై రెచ్చిపోయారు.

బాధిత మహిళతో బేరసారాలు

తనను లైంగికంగా వేధిస్తున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మహిళా పోలీస్‌తో కార్పొరేషన్ ఉన్నతాధికారి బేరసారాలు చేశాడన్న ఆరోపలున్నాయి. విచారణ సమయంలో అనుకూలంగా మాట మార్చి చెబితే రూ.15 లక్షల వరకు ఇస్తామని ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే బాధిత మహిళ మాత్రం బేరసారాలపై కన్నెర్ర చేసి ప్రస్తుతం దూరంగా ఉన్నట్లు తెలిసింది.

అదంతా తప్పుడు ప్రచారం

మహిళా పోలీస్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమే. కానీ లైంగికంగా వేధింపులు చేసినట్లు ఆరోపణలు కాదు. ఆమె డ్యూటీ సరిగా చేయలేదని ఫిర్యాదులు రావడంతో ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేశాను. ఆమె స్పందించకపోవడంతో మరో సచివాలయానికి బదిలీ చేశాం. అక్కడ జాయిన్ కాకపోవడంతో ఎస్పీకి సరెండర్ చేశాం. దీంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది.

– వైఓ నందన్,
నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్

గూడూరులోనూ ఆరోపణలు

సదరు అధికారి గతంలో హయాంలో గూడూరులో పనిచేసిన సమయంలో కూడా ఓ టీచర్‌ను లైంగికంగా వేధించిన ఘటన అప్పట్లో సంచలనం కలిగించింది. గూడూరు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న సమయంలో మున్సిపల్ టీచర్‌ను లైంగికంగా వేధించి ముప్పుతిప్పలు పెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఆయన ఎక్కడ పని చేసినా కూడా మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించే వాడని ఆరోపణలున్నాయి. అలాంటి అధికారిని ఏరికోరి ఐఏఎస్ హోదా కలిగిన సీటులో కూర్చోబెట్టారు. 'కనకపు సింహాసనమున శునకము గూర్చుండ బెట్టి శుభలఘ్నమునం దొనరగ బట్టము గట్టిన వెనుకటి గుణమేల మాను' చందంగా ఉందని నగర ప్రజలతోపాటు మహిళా సంఘాలు ఛీదరించుకుంటున్నాయి.

కర్షకులపై 'ఖాకీ' ఆంక్షలు

- భూసేకరణకు వ్యతిరేకంగా మహా ఉద్యమానికి కరేడు రైతుల పిలుపు
- ధర్నాలు చేయడానికి వీల్లేదంటూ హెచ్చరికలు
- కేసులు పెడతామంటూ స్టేషన్‌కు పిలిపించి వార్నింగ్
- కరేడు, రామాయపట్నం ప్రాంతాల్లో పొలాలు కోల్పోతున్న రైతుల తీవ్ర ఆవేదన

కందుకూరు: కూటమి ప్రభుత్వం భావప్రకటనా స్వేచ్ఛను, ప్రశ్నించే హక్కులను, నిరసన హక్కులను కాలరాస్తోంది. బీపీసీఎల్, ఇండోసోలార్ ప్రాజెక్ట్‌ల కోసం ప్రభుత్వం చేపడుతున్న భూసేకరణను నిరసిస్తూ ఏకమవుతున్న రైతులపై ఉక్కుపాదం మోపుతోంది. వ్యవసాయమే జీవనాధారమైన రైతుల బతుకులను ఛిద్రం చేస్తూ పచ్చని పంట పొలాలను లాక్కోవడంపై తీవ్ర వేదనలో ఉన్న కర్షకులపై 'ఖాకీలు' అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఆందోళనల పేరిట రోడ్డెక్కితే కేసులు పెడుతామంటూ స్టేషన్‌కు పిలిపించి మరీ వార్నింగ్ ఇస్తున్న తీరు ప్రజాస్వామ్య హక్కులను పోలీసులు హరిస్తున్నట్లుగా ఉంది.

జీవనోపాధి దెబ్బతిని..

రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా బీపీసీఎల్, ఇండో సోలార్ కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే ఇండోసోలార్ ప్రాజెక్ట్ పనులు జరుగుతుండగా, బీపీసీఎల్ ఏర్పాటుకు భూములు కేటాయించాల్సి ఉంది. ఈ రెండు ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లోని గ్రామాల్లో వేలాది ఎకరాల భూములను సేకరించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ఉలవపాడు మండలంలోని మేజర్ పంచాయతీ కరేడుతో దాదాపు 16 గ్రామాల పరిధిలో పచ్చని పంట పొలాల సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ భూముల్లో ఏళ్ల తరబడి సాగు చేస్తున్న ప్రఖ్యాతి గాంచిన మామిడి తోటలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటువంటి భూములను ఇచ్చేందుకు అక్కడి రైతులు ససేమిరా అంటున్నారు. తమ జీవనాధారమైన పంట పొలాలను కోల్పోతే జీవనోపాధి దెబ్బతింటుందని రైతులు ముందుకు రావడం లేదు. ఇటీవల జరిగిన గ్రామసభల్లోనూ అధికారులకు ఇదే విషయాన్ని తేల్చి చెప్పారు. అయినా సరే ప్రభుత్వం భూములను బలవంతంగానైనా తీసుకునేందుకు సిద్ధమైంది. వెనక్కి తగ్గని ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేపట్టేందుకు ముందుకు వెళ్తుంది. పోలీస్ బలగాలను అడ్డం పెట్టుకుని రైతుల వద్ద భూములను లాక్కునేందుకు చేస్తున్న ప్రయత్నాలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ధర్నా చేస్తే కేసులు పెట్టి లోపలేస్తాం

భూములు కోల్పోతున్న రైతులు ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు. ఆదివారం కరేడు ప్రాంత రైతులు జాతీయ రహదారిని దిగ్బంధం చేసేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. ఇది తెలుసుకున్న ప్రభుత్వం పోలీస్ అధికారులను రంగంలోకి దించింది. ఆ ప్రాంతంలోని రైతు నాయకులు, కొందరు రైతులను శుక్రవారం కందుకూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు వీలు లేదని, కాదని చేపడితే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. జాతీయ రహదారి దిగ్బంధం కార్యక్రమాన్ని విరమించుకోవాలని రైతులను ఆదేశించారు. అయితే తమకు న్యాయం జరిగే వరకు ఎన్ని ఆంక్షలు పెట్టినా పోరాడి తీరుతామని రైతులు అంటున్నారు.

మీ దగ్గర ఆధారాలుంటే స్పందిస్తా

- సిట్ అధికారులకే దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చిన కాకాణి
- కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకే కేసులు పెడుతున్నారు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్, మట్టి అక్రమ రవాణాపై సిట్ అధికారులు మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసుకు సంబంధించి రెండు రోజుల కస్టడీ విచారణలో సిట్‌కే దిమ్మదిరిగే కౌంటర్ ఇచ్చినట్లు సమాచారం. తొలి రోజు 30 ప్రశ్నలు, రెండో రోజు 20 ప్రశ్నలను పదేపదే అడుగుతూ సిట్ అధికారులు విచారణ చేపట్టారు. అక్రమాలు జరిగినట్లు మీ దగ్గర ఆధారాలు ఉంటే చూపిస్తే.. తాను స్పందిస్తానంటూ కాకాణి సిట్ అధికారులనే నిలదీశారని ఆయన తరపున న్యాయవాదులు చెబుతున్నారు. సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు ఎంపీ మాగుంట సంతకం ఫోర్జరీతో అనుమతులు తీసుకోవడంపై కృష్ణపట్నంపోర్టు స్టేషన్‌లో కాకాణిని ఆయన తరపు న్యాయవాదుల సమక్షంలో రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీ విచారణ పూర్తయింది. ఈ సందర్భంగా సిట్ అధికారులకు కాకాణి సరైన సమాధానాలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులో భాగంగానే నాపై అక్రమ కేసులు నమోదు చేశారని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ఆధార రహితంగా.. ఏ1 చుట్టూనే ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. విచారణలో సిట్ అధికారులు వేసిన కొన్ని ప్రశ్నలకు కాకాణి ఇచ్చిన సమాధానాలు ఇలా ఉన్నాయి.

సిట్ : ఏ–1 నిరంజన్‌రెడ్డితో మీకేం సంబంధం?

కాకాణి: నాకు వ్యక్తిగత మిత్రుడు. చాలా సంవత్సరాల నుంచి పరిచయం. వ్యాపార లావాదేవీలు లేవు.

సిట్: సర్వేపల్లి రిజర్వాయర్‌లో మట్టి, గ్రావెల్, మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించడానికి మీరు అతనికి ఏదైనా హామీ లేదా మద్దతు ఇచ్చారా?

కాకాణి: నేను ఎవరికీ హామీ ఇవ్వలేదు. సరికాదా ఆ విషయం నా దగ్గర చర్చకు కూడా రాలేదు. నాకు తెలియదు.

సిట్: ఈ కేసులో ఏ–1 అల్లంపాటి నిరంజన్‌రెడ్డి మీ ప్రమేయంతోనే ఇరిగేషన్ అధికారులు వద్ద నుంచి ఒక్క రోజులోనే అన్ని అనుమతులు పొంది సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి మట్టి, గ్రావెల్ అమ్మి అక్రమ సంపాదన చేసినట్లు చెప్పిన దానికి మీ సమాధానం?

కాకాణి: ఇరిగేషన్ అధికారులకు అనుమతులు ఇవ్వమని కానీ, మరే అధికారికి గ్రావెల్ తవ్వకాలకు సహకరించమని గానీ, నేను ఎన్నడూ చెప్పలేదు. దాని గురించి కానీ దాని తాలూకూ లావాదేవీల గురించి తెలియదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి అనేక సందర్భాల్లో ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుండడంతో ప్రతిపక్ష పార్టీకి చెందిన నాపై కేవలం కక్ష సాధింపులో భాగంగా బనాయించిన అక్రమ కేసుగానే భావిస్తున్నాను. తప్పా నా పాత్ర ఏమిలేదు. సంబంధం లేదు. నాకు ప్రయోజనం కలగలేదని కచ్చితంగా తెలియపరుస్తున్నాను.

సిట్: సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి మట్టి, గ్రావెల్ అక్రమ మైనింగ్ ఆపరేషన్ వల్ల మీకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లభించింది?

కాకాణి: నాకు సంబంధం లేని విషయంలో ప్రయోజనం ఆశించడం అనే ప్రశ్న తలెత్తదు.

సిట్: మీ ఇంటి నిర్మాణం ఏ ఏడాదిలో జరిగింది. సదరు ఇంటి నిర్మాణంలో ఏ–1 నిరంజన్ రెడ్డి పాత్ర ఏంది?

కాకాణి: ఇంటి నిర్మాణం 2020 నుంచి 2023 వరకు జరిగింది. నాకున్న అనేక మంది మిత్రులు అనేక సలహాలు ఇచ్చేవారు. పరిశీలించి పాటించే వాడిని తప్ప, ప్రత్యేకమైన పాత్ర అంటూ నిరంజన్‌రెడ్డి విషయంలో లేదు.

సిట్ : అల్లంపాటి నిరంజన్‌రెడ్డికి మీ మధ్య ఎటువంటి వ్యాపార లావాదేవీలు లేవని తెలిపారు. మీ కుమార్తె అకౌంట్‌కు నగదు బదిలీ అయినది. దీని గురించి వివరణ ఇవ్వగలరా?

కాకాణి: ఆ వివరాలు నాకు తెలియదు. మీరు ఇస్తే కనుక్కోని తెలియజేయగలను.

గ్రావెల్ కేసులో బెయిల్



నెల్లూరు (లీగల్): సర్వేపల్లి జలాశయం నుంచి అక్రమంగా గ్రావెల్ తరలించారని ఆరోపిస్తూ మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై వెంకటాచలం పోలీసులు నమోదు చేసిన కేసులో ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ నెల్లూరు రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శారదారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రూ.10 వేలు ఆస్తి విలువ కలిగిన ఇద్దరు జామిందార్ల పూచీకత్తుపై విడుదలకు ఆదేశాలిచ్చారు.

జాయింట్ ఎల్‌పీఎం పూర్తికి ప్రత్యేక డ్రైవ్

- జేసీ కార్తీక్



నెల్లూరు రూరల్: అన్నదాత సుఖీభవ పథకానికి అవసరమయ్యే జాయింట్ ఎల్‌పీఎం (జాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్) పూర్తి చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జేసీ కె. కార్తీక్ రెవిన్యూ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కావలి, కందుకూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని తహసీల్దార్లతో రీసర్వే, డిజిటలైజేషన్, హౌసింగ్, సీసీఆర్‌డీ కార్డులు, సిటిజన్ సర్వీసెస్ తదితర రెవెన్యూ సంబంధిత విషయాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో రెండో విడత ఎంపికైన గ్రామాల్లో రీసర్వే సక్రమంగా పూర్తి చేయాలని, ఇప్పటికే రీసర్వే పూర్తయిన గ్రామాల్లో తలెత్తిన సమస్యలను పరిగణలోకి తీసుకుని మరింత జాగ్రత్తగా పూర్తి చేయాలన్నారు. రీసర్వేలో 22ఏ, పీజీఆర్ఎస్‌లో ఉన్నటు వంటి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. రెవెన్యూ రికార్డులన్నింటినీ డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. రెవెన్యూ సంబంధిత చట్టపరమైన విషయాల నిర్వహణను క్రమబద్ధీకరించడానికి, వాటిని పారదర్శకంగా చేయడానికి రూపొందించబడిన వెబ్ ఆధారిత వ్యవస్థ ఓఆర్‌సీఎంఎస్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అర్హత ఉన్న కౌలు రైతులకు సీసీఆర్‌కార్డులు అందజేయాలన్నారు. సీసీఆర్‌సీ కార్డులు మంజూరులో ఆలస్యమైతే వివిధ ప్రయోజనాలను, ముఖ్యంగా పంట రుణాలను పొందే అవకాశం కోల్పోతారన్నారు. ఈ సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ టి. శ్రీపూజ, డీఆర్‌ఓ ఉదయభాస్కర రావు, కావలి ఆర్డీఓ వంశీ కృష్ణ పాల్గొన్నారు.

3,680 కొత్త పింఛన్లు మంజూరు

నెల్లూరు (పొగతోట): సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా పింఛన్ తీసుకుంటూ మరణించిన వారి భార్యలు 3,680 మందికి కొత్త పింఛన్లు వచ్చే నెల 1వ తేదీ నుంచి పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతేడాది నవంబరు నుంచి పింఛన్ తీసుకుంటూ మరణించిన వ్యక్తుల భార్యలకు కొత్తగా పింఛన్ మంజూరు చేస్తున్నామన్నారు. వచ్చే నెల 1వ తేదీ పాత పెన్షన్‌తోపాటు కొత్తగా మంజూరైన వారికి కూడా పింఛన్ నగదు అందిస్తామని తెలిపారు. అనంతరం డీఆర్‌డీఏలో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు సిబ్బంది ఒక్క రోజు వేతనాన్ని అందించారు. దానికి సంబంధించిన చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

మరో కేసులో కాకాణికి జూలై 11 వరకు రిమాండ్

నెల్లూరు (లీగల్): కనుపూరు చెరువులోని మట్టిని అక్రమంగా తరలించారని వెంకటాచలం పోలీసులు మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై నమోదు చేసిన కేసులో జూలై 11 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులిచ్చారు. నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి పీటీ వారెంట్‌తో గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరు నాల్గో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం పోలీసులు హాజరుపరిచారు. పోలీసులు తరపున ఏపీపీ లక్ష్మీ నారాయణ తమ వాదనలు వినిపించారు. కాకాణిని తరపున రామిరెడ్డి రోజారెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, సిద్ధన సుబ్బారెడ్డి వాదనలు వినిపిస్తూ కేవలం రాజకీయ కక్షతో దురుద్దేశంతో కేసు పెట్టారని తమ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనల విన్న న్యాయమూర్తి నిషాద్ నాజ్ షేక్ గోవర్ధన్‌రెడ్డి పై నమోదు చేసిన సెక్షన్లలో 467 ఐపీసీ వర్తించదని ఆ సెక్షన్‌ను తొలగించారు. మిగతా సెక్షన్ల కింద జ్యుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఉచిత శిక్షణ

నెల్లూరు (టౌన్): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కం స్కిల్ డెవలప్‌మెంట్'పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మారుతీప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజులపాటు ఉచిత శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు స్థాపించేందుకు ప్రాజెక్ట్ ప్రిపరేషన్, పథకాల వివరాలు, మార్కెట్‌పై అవగాహన పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9000173808, 8121331514 నంబరలో సంప్రదించాలన్నారు.

కాకాణికి రెండు రోజుల పోలీస్ కస్టడీ

నెల్లూరు (లీగల్): కృష్ణపట్నం పోర్ట్ సమీపంలో చెక్‌పోస్ట్ ఏర్పాటుచేసి అక్రమంగా డబ్బులు వసూలు చేశారని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ముత్తుకూరు పోలీసులు అక్రమంగా నమోదు చేసిన మరో కేసులో విచారణ నిమిత్తం రెండు రోజులు పోలీస్ కస్టడీకి ఇస్తూ నెల్లూరు 4వ అదనపు మొదటి తరగతి మేజిస్ట్రేట్ నిషాద్ నాజ్ షేక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకాణిని 30వ తేదీ ఉదయం 8 గంటలకు విచారణ నిమిత్తం నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి పోలీస్ కస్టడీకి తీసుకోవాలని, 1వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఆయనకు వైద్య పరీక్షలు చేయించి మెడికల్ సర్టిఫికెట్‌తో కోర్టులో హాజరుపర్చాలని, విచారణ సమయంలో థర్డ్ డిగ్రీ ఉపయోగించకూడదని ఉత్తర్వులో పేర్కొన్నారు. న్యాయవాది సమక్షంలో గోవర్ధన్‌రెడ్డిని విచారణ జరపాలన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పోలీసులు నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరు 4వ అదనపు జ్యుడీషియల్ న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. పోలీసులు తరపున ఏపీపీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ గోవర్ధన్‌రెడ్డి నుంచి కేసుకు సంబంధించి వివరాలు సేకరించేందుకు ఏడు రోజుల పోలీస్ కస్టడీ ఇవ్వాలని కోరారు. కాకాణి తరపున రామిరెడ్డి రోజారెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, సిద్ధన సుబ్బారెడ్డి వాదనలు వినిపిస్తూ ఈ కేసులో ప్రాథమిక ఆధారాలు లేవని, కేవలం రాజకీయ కక్షతో కేసు పెట్టారని, కస్టడీకి ఇవ్వాల్సిన అవసరం లేదని వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డికి రెండు రోజుల పోలీస్ కస్టడీకి ఇస్తూ ఉత్తర్వులిచ్చారు.

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి

• రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ మాజీ ౖచైర్‌పర్సన్ శిరీష



సైదాపురం: అక్రమ మైనింగ్‌దారుల వల్ల తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ మాజీ ౖచైర్‌పర్సన్ పొట్లేళ్ల శిరీష యాదవ్ జిల్లా పోలీస్ ఉన్నత అధికారులను కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ సైదాపురం మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లా మైనింగ్ అధికారులతోపాటు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న కొందరు తమపై తప్పుడు కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. ప్రాణహాని తలపెట్టేందుకు పావులు కదుపుతున్నట్లు తెలిసిందన్నారు. నిరంతరం ఖనిజ సంపదను కొల్లకొడుతూ ప్రభుత్వ ఆదాయానికి అడ్డుపడుతున్న అక్రమార్కులపై నిరంతరం పోరాటం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని టార్గెట్ చేశారని ఆరోపించారు. రక్షణ కల్పించాలని విన్నవించారు.

జిల్లా పరిషత్, కలెక్టరేట్ వాహనాల వేలం

నెల్లూరు రూరల్: నెల్లూరు నగరంలోని నూతన జిల్లా పరిషత్ కార్యాలయం, కలెక్టరేట్‌లో వాడుకలో లేని మారుతి సుజుకి, స్కార్పియో, ఇన్నోవా వాహనాలను వేలం వేయనున్నట్లు డీఆర్వో ఉదయభాస్కర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 3వ తేదీ ఉదయం 10.30 గంటలకు నెల్లూరు నూతన జిల్లా పరిషత్ కార్యాలయములో వేలంపాట జరుగుతుందన్నారు. ధరావత్తు సొమ్ము రూ.10 వేలు చెల్లించాలన్నారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నిర్ధారించిన ధరలకు వాహనాలను వేలం వేస్తామని తెలియజేశారు.

కసుమూరు దర్గా హుండీ ఆదాయం రూ.44.17 లక్షలు

వెంకటాచలం: దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన కసుమూరు మస్తాన్‌వలీ దర్గా హుండీ ఆదాయం రూ.44.17 లక్షలు వచ్చినట్లు ఈఓ షేక్ షరీఫ్ శుక్రవారం తెలిపారు. దర్గాలో మొత్తం 8 హుండీలు ఏర్పాటు చేశామన్నారు. రెండు ప్రధాన హుండీల్లో కానుకలను గురు, శుక్రవారాల్లో లెక్కించగా రూ.44.17 లక్షలు వచ్చాయన్నారు. మిగిలిన ఆరు హుండీల్లోని కానుకలను 15 రోజుల తర్వాత లెక్కిస్తామన్నారు.

ఉచితంగా నట్టల నివారణ మందు

నెల్లూరు(పొగతోట): గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్నట్లు పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ రమేష్ నాయక్ తెలిపారు. శుక్రవారం వివిధ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాదిలో నాలుగుసార్లు మందు పంపిణీ చేస్తున్నారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

వరికుంటపాడు: మండలంలోని రామాపురం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. వరికుంటపాడు పంచాయతీ పరిధిలోని ఆంధ్రవారిపల్లికి చెందిన గాడి మాధవరెడ్డి (45) మోటార్‌బైక్‌పై తిమ్మారెడ్డిపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. అలాగే వైఎస్సార్ జిల్లా ముద్దనూరు నుంచి రాజమండ్రికి కూరగాయల లోడుతో బొలెరో వాహనం వెళ్తోంది. రెండు వాహనాలు రామాపురం సమీపంలోని నక్కలగండి రిజర్వాయర్ కాలువ వద్దకు రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మాధవరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై దోపిడీలు

• నిందితుల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్): వారంతా మద్యం, చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. వ్యసనాలను తీర్చుకునేందుకు ముఠాగా ఏర్పడి ఒంటరిగా వెళ్లేవారిని చంపుతామని కత్తులతో బెదిరించి నగదు దోచుకెళుతున్నారు. నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరు నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. ఓ బ్యాంకు ఉద్యోగి ఈనెల 25వ తేదీన తన కుటుంబంతో కలిసి బైక్‌పై వెళుతుండగా రైల్వే స్టేషన్ వద్ద ముగ్గురు నిందితులు అడ్డగించారు. కత్తులతో చంపుతామని బెదిరించి నగదు దోచుకెళ్లారు. అదేరోజు రాత్రి ఇద్దరు బాలలు మద్యం తాగేందుకు తడికల బజారు సెంటర్ దళితవాడలో ఒంటరిగా ఇంటిముందు నిద్రిస్తున్న మహిళను కత్తితో బెదిరించి నగదు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుల మేరకు నవాబుపేట పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో సిబ్బంది బృందాలుగా ఏర్పడి సాంకేతికత ఆధారంగా బ్యాంకు ఉద్యోగిని బెదిరించి నగదు దోచుకెళ్లింది ఉడ్‌హౌస్ సంఘానికి చెందిన మునితేజ, సీహెచ్ మహేష్, బాలాజీనగర్‌కు చెందిన బి.దేవకుమార్‌లుగా గుర్తించారు. దళితవాడ దోపిడీ కేసులో ఇద్దరు బాలల్ని గుర్తించారు. శుక్రవారం వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. చెడు వ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతున్నట్లు వారు అంగీకరించారు. దీంతో ఇద్దరు బాలలను తిరుపతిలోని జువెనైల్ హోంకు తరలించి మిగిలిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. కేసులను ఛేదించడంలో ప్రతిభ చూపిన ఇన్‌స్పెక్టర్, ఎస్సై రెహమాన్, సిబ్బంది నరసయ్య, ప్రసాద్, మస్తాన్ రావు, సుధాకర్, వేణు, మస్తానయ్య, గౌస్‌బాషాలను ఎస్పీ అభినందించారు.

నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు

• ఆవేదనలో వెలుగు ఉద్యోగులు



సీతారామపురంలోని డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయం

సీతారామపురం: వెలుగు విభాగంలో ప్రభుత్వం చేపట్టిన సాధారణ, సర్దుబాటు పేరిట బదిలీల ప్రక్రియలో పారదర్శకత లోపించింది. నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ కక్ష సాధింపుతో బదిలీలు చేశారంటూ ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయినవారికి జిల్లాలో, కాని వారికి ఇతర జిల్లాలకు స్థానచలనం ఎలా చేస్తారని కొందరు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. సర్దుబాటు ప్రక్రియ కూడా లోపభూయిష్టంగా ఉందని పలువురు విమర్శిస్తుండగా, కొందరు ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. బదిలీలకు సంబంధించి సెర్ప్ కొన్ని మార్గదర్శకాలు విడుదల చేయగా అందుకు విరుద్ధంగా జిల్లాలో బదిలీలు జరిగాయన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 23 ప్రకారం ఒకచోట ఐదేళ్లు సర్వీస్ పూర్తిచేసిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలి. అయితే కేవలం ఒక సంవత్సరం సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని సైతం ఇతర జిల్లాకు బదిలీ చేసినట్లు తెలిసింది. సర్‌ప్లస్ కాకపోయినా రాజకీయాలు చేసి ఐదుగురు ఏపీఎంలను పల్నాడు జిల్లాకు బదిలీ చేశారు. అంతంతమాత్రపు జీతాలతో అంత దూరం వెళ్లి విధులు ఎలా నిర్వహించాలంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సీనియారిటీ లిస్టును పక్కనపెట్టి చేపట్టిన బదిలీల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని, డబ్బులిచ్చిన వారిని మినహాయింపు ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా నుంచి ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుష ఏపీఎంలను పల్నాడు జిల్లాకు పంపారు. వీరంతా సెర్ప్ గైడ్‌లైన్స్ ప్రకారం బదిలీలకు అనర్హులు. వారు ముందస్తు దరఖాస్తు చేసుకోలేదు. అయినా నిబంధనలకు విరుద్ధంగా ఇతర జిల్లాకు బదిలీ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తహసీల్దార్, ఎంపీడీఓలు, ఇతర మండల స్థాయి అధికారులకు సైతం జిల్లా స్థాయిలో బదిలీలు జరుగుతుండగా ఏపీఎంలకు మాత్రం జోనల్ స్థాయిలో స్థాన చలనం కలిగించడం గమనార్హం.

మోడల్ ప్రైమరీ స్కూళ్లలో తాత్కాలిక మరమ్మతులు



మాట్లాడుతున్న ఏపీసీ వెంకటసుబ్బయ్య

నెల్లూరు(టౌన్): జిల్లాలోని 470 మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో ఆగస్టు చివరి నాటికి తాత్కాలిక మరమ్మతులను పూర్తి చేయనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య తెలిపారు. నెల్లూరులోని సమగ్రశిక్ష కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయా స్కూళ్లలో 1,270 గదులు అవసరమని గుర్తించినట్లు చెప్పారు. పెద్ద రూమ్‌లను రెండు తరగతి గదులుగా ఏర్పాటు చేయడం, లేదా వరండాను రెండు తరగతి గదులుగా, మేజర్, మైనర్ రిపేర్లు, ఎలక్ట్రికల్ వర్క్స్, గ్రీన్ చాక్‌బోర్డు, డ్యూయల్ డెస్క్ తదితర పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. స్కూల్ మెయింటెనెన్స్‌కు 2,571 ప్రభుత్వ పాఠశాలలకు రూ.2.88 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం రూ.54.77 లక్షలు విడుదల చేసినట్లు చెప్పారు. మిగిలిన నిధులు డిసెంబర్‌లో విడుదల కానున్నట్లు చెప్పారు. గతంలో 42 స్కూల్స్ పీఎంశ్రీకు ఎంపికయ్యాయన్నారు. తాజాగా తోటపల్లిగూడూరు మండలం కోడూరులోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్, సంగంలోని ఏపీఎస్‌ఆర్‌డబ్ల్యూఆర్, ఉలవపాడులోని ఏపీ మోడల్ స్కూల్, అల్లూరు మండలంలోని అల్లూరుపేటలోని జెడ్పీహెచ్‌ఎస్‌లు ఎంపికైనట్లు తెలిపారు. జిల్లాలోని 10 కేజీబీవీల్లో రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈనెల 12 నుంచి వచ్చేనెల 12వ తేదీ వరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. సీఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్ పాల్గొంటారని చెప్పారు. డ్రాప్‌బాక్స్‌లో 14,232 మంది ఉన్నారని, వారిని ఆయా పాఠశాలల్లో చేర్పించనున్నట్లు పేర్కొన్నారు.

ఆటోలో నుంచి దూకేసిన తల్లీకుమార్తె

• డ్రైవర్ దారి మళ్లించి తీసుకెళ్తుండగా ఘటన

నెల్లూరు(క్రైమ్): డ్రైవర్ ఆటోను దారి మళ్లించి తీసుకెళుతూ మార్గమధ్యలో ప్రయాణికురాలి పట్ల అసభ్యంగా వ్యవహరించాడు. దీంతో ఆమె, కుమార్తెలు ఆటోలో నుంచి దూకేయడంతో గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఓ మహిళ పొగతోటలోని ఓ హాస్పిటల్లో అకౌంటెంట్‌గా పనిచేస్తోంది. రోజూ సాయంత్రం ఆమె విధులు ముగించుకుని ఆటోలో ఇంటికి వెళ్తుంటారు. ఈనెల 25వ తేదీ సాయంత్రం ఆమె, తన కుమార్తెతో కలిసి ఎప్పటిలాగే బాలాజీనగర్ వెళ్లేందుకు హాస్పిటల్ సమీపంలో ఆటో ఎక్కారు. డ్రైవర్ గాంధీబొమ్మ, కనకమహల్, రామచంద్రారెడ్డి హాస్పిటల్, చిల్డ్రన్స్ పార్కు మీదుగా ఎన్టీఆర్ నగర్ జంక్షన్ వైపు వేగంగా వెళుతుండటంతో ఆమెకు అనుమానం వచ్చి ప్రశ్నించింది. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె తన కుమార్తెతో కలిసి ఆటోలో నుంచి దూకేశారు. గాయాలపాలైన తల్లీకుమార్తెలు ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. శుక్రవారం బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ విఫలమైందని..

• యువకుడి బలవన్మరణం

నెల్లూరు(క్రైమ్): ప్రేమ విఫలమవడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. ఉడ్‌హౌస్ సంఘంలో ఎస్.వెంకటేశ్వర్లు కుటుంబం నివాసం ఉంటోంది. అతని కుమారుడు అశోక్ (26) కొంతకాలంగా ఓ యువతితో ప్రేమలో ఉన్నాడు. ఇటీవల వారి ప్రేమ విఫలం కావడంతో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అశోక్ సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తండ్రి హుటాహుటిన కుమారుడిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అశోక్ మృతిచెందాడని నిర్ధారించారు. బాధిత తండ్రి శుక్రవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.25
సన్నవి : రూ.20
పండ్లు : రూ.8



జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ

నెల్లూరు(టౌన్): జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వాలని డీఈఓ బాలాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఫీజు రాయితీపై ఆయా మండల ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం పంపినట్లు వెల్లడించారు.

కండలేరులో 33.986 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 33.986 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,040, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

రైల్లో నుంచి పడి..

• వ్యక్తి మృతి

మనుబోలు: విజయవాడ నుంచి చెన్నై వెళ్తున్న రైల్లో నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మనుబోలు – కొమ్మలపూడి రైల్వే స్టేషన్ల మధ్య 147/7–5 కిలోమీటర్ వద్ద శుక్రవారం వేకువజామున చోటుచేసుకుంది. మృతుడి వయసు సుమారు 50 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. పింక్ కలర్ చెక్స్ ఫుల్ హ్యాండ్స్ షర్టు, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై హరిచందన తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR

■ APOSS (Open School) ద్వారా ఒకే సం॥లో 10th/ ఇంటర్, B.A, B.Com, M.A(all), M.Sc (all), M.Com, BLISC, MLISC లకు అడ్మిషన్లు జరుగుచున్నవి. 8121888335. [NA-7019]

■ 10th/Inter, BA, B.Com, B.Sc, BBA, BCA, BLIS, MA, M.Com, MSc, MCA, MBA, MLIS, Dip, B.Tech, M.Tech, M.phil, Ph.D., BNYS,BPT. Contact: 90300 30125. [SCA25005440]

■ డైరెక్ట్10th, Inter, (వయస్సు:18) Degree(All) PG(All) అడ్మిషన్ గైడెన్స్, డిప్లొమా, B.Tech, M.Tech, DBM ఫార్మసీ, M.Phill, Phd, BAMS, BHMS, BUMS. 8143100455, 8074482388 [G-235]

REAL ESTATE

FLAT FOR SALE

■ పెద్ద చెరుకూరు (అల్లీపురం) సిరిగార్డెన్‌లోని గణేష్ సాగర్ అపార్ట్‌మెంట్‌లో 2BHK East &West ఫేస్ ఫ్లాట్స్ (1300Sft) అమ్మబడును. మర్రి శీనయ్య,97019 04999, 96184 84822. [NA-24248]

■ నెల్లూరుసిటీ ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో అపార్ట్‌మెంట్ 3వ ఫ్లోర్‌లో 1560Sft గల 3BHK FLAT 40లక్షలకే అమ్మకానికి కలదు. కొనదలచిన వారు సంప్రదించండి: 9441582575. [NA-24256]

PLOT FOR SALE

■ నెల్లూరు,ధనలక్ష్మీపురం, వసుధ లేవుట్, హౌసింగ్‌బోర్డు, M.K. లేవుట్‌లలో 18 అంకణములు & 33 అంకణముల ప్లాట్లు అమ్మబడును. సెల్: 95504 20978. [NA-7013]

■ నెల్లూరు ఉస్మాన్‌సాహెబ్‌పేట, కోదండ రామపురం మహాలక్ష్మీగుడి వీధిలో పడమర వాకిలి స్థలం (21×50) 14అం॥గాని 20అం॥లు గాని అమ్మబడును. సంప్ర: 9949701555. [NA-24251]

SALE / RENT

■ అనంతపురం జిల్లా, గుత్తి-గుంతకల్ మధ్యన @ పాతకొత్తచెరువు. బళ్ళారి – నెల్లూరు నేషనల్ హైవే కి రోడ్డు బిట్, ఒక్కొక్కటి 100×100 కొలతలు గల 3 ఓపెన్ ప్లాట్స్-1 షెడ్డు, డాబా హోటల్స్ / గోడౌన్స్ / వర్క్ షాప్స్ కి లీజ్ / రెంట్ కు లేదా అమ్మకమునకు కలవు. సెల్: 9449986123, 9347039123. [A-1656]

TO-LET

■ Available 1,500 Sft. Space for Office Purpose, Second floor above Ayush Dental Care, Near Underbridge, Ramalingapuram, Nellore. [NA-7022]

■ నెల్లూరు, మూలాపేట, వేళాంగిణి స్కూలు దగ్గర తులిప్స్ Appt, 3BHK, కారు పార్కింగ్ గలఫ్లాట్, శివాలయం సెంటర్‌లో 2BHK ఇల్లు (2ఫ్లోర్).బాడుగకు.6304221315,9435716132. [NA-2873]

SERVICES

GOLD FINANCE

■ వివిధ తాకట్టు సంస్థలు, బ్యాంకుల నుండి బంగారు నగలు విడిపించి అమ్మి రొక్కం ఇప్పించబడును. బంగారు నగలు హోల్‌సేల్ రిటైల్‌తో సరఫరా చేయబడును. ఫోన్: 77290 47122. [V- 6754]

■ బ్యాంకులలో వివిధ తాకట్టు సంస్థలలో ఉన్నటి బంగారు వేలం సమయానికి విడిపించి మార్కెట్ ధర ప్రకారం స్పాట్ క్యాష్ ఇవ్వబడును. ఫోన్ : 98851 82772, 62813 46878 [V- 6756]

WANTED

■ Wanted Natural Science, Social Teacher (6 to 10) Sainadh School Varadapuram, Podalakur (M). Contact : 99499 88564. [NA-11320]

■ Wanted Married Female Tele Callers for Banking Process RTC. Nellore. salary : 15000/-. No Targets. Contact.79979 21150. [SCA25005469]

■ Wanted Staff Immediately Electricians, Forklift operators, Site Supervisors, Office Assistants Contact : 9705292989. [NA-3940]

■ Freshers & Experienced Welcome Roles! : Business Analyst, HR, Content Creator, Editor, Anchor, Accountant, Join our fast- growing Youtube based startup. WFH available | Laptop optional. "Real-time Projects | Friendly Team Skill Growth & Mentorship Job Seekers & Career Restarters". WA: 9490879955 Email : originalmorals@gmail.com [SCA-25005466]

■ సెక్యూరిటి సూపర్ వైజర్లు / గార్డులు కందుకూరు టౌనుకి / సింగరాయకొండకి కావలెను. మంచి జీతము, PF, ESI కలదు. సంప్ర॥ 9951072170, 9550076180. [NA-11322]

■ ప్రముఖ కంపెనీ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ పురుషులు కావలెను. అర్హత: 10th – డిగ్రీ, జీతం: 15,000 నుంచి. సంప్ర॥ 99084 29239 [G-615]

■ ప్రముఖ హాస్పిటల్ షాపు నందు పార్మాసిస్టుగా పని చేయుటకు B.Pharm / D.Pharm చదివిన వారు రిసెప్షనిస్ట్ కావలెను. Note : Freshers Only. సంప్రదించండి: 90108 68509. [NA-24258]

■ ప్రముఖ యూనివర్సిటీ ఆఫీసు నందు పని చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Qul : Degree, Salary : 10K to 15K, Contact : 9980969616, 9940159236. [NA-11321]

■ బ్యాంక్ లోన్స్ ప్రాసెస్ నందు Tele Caller కావలెను. 30+ Age Married Female, టార్గెట్స్ లేవు, జీతం: 12000/– నర్తకి సెంటర్, నెల్లూరు. ఫోన్ : 88858 02000, 83409 00666. [NA-24193]

■ కోవూరులోని ప్రముఖ ఫీడ్ ఫ్యాక్టరీలో పని చేయుటకు Tally & Income Tax Accountantsలో అనుభవము గల అకౌంటెంట్స్ కావలెను.సంప్ర:7013332153,9701515664. [NA-11319]

■ నెల్లూరు, హరనాథపురం మెయిన్‌రోడ్డు AMR HP పెట్రోల్ బంకులో డే & నైట్ షిఫ్ట్ పనిచేయుటకు యువతీయువకులు & ఎయిర్ బాయ్స్. 8985264143, 9494797343. [NA-7011]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసు కోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ:15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15938]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 96032 03355, 92814 52843 [SCA25005423]

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థకు పిడతపోలూరు, కాకుపల్లి, ముత్తుకూరు రోడ్డు ఏరియాలలో 12గం॥ల డ్యూటీ చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, ASO లు కావలెను. జీతం. 15,000. సంప్రదించండి:9908954793, 7702577508. [NA-7020]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 8 గంటల వరకు మాత్రమే తీసుకోబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.